www.nagaranijam.com
PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

| సంపుటి : 14 | సంచిక :84 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 16 మంగళవారం, జూన్ 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 84 | Rangareddy | Editor : Yela.Purushotham | 16 Tuesday , JUNE 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## డెక్కన్ జెమ్స్ పాఠశాల ఘన ప్రారంభోత్సవం





- నాణ్యమైన విద్యతోనే విద్యార్థుల భవిష్యత్ నిర్మాణం

**సాధ్యం: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

**కుత్బుల్లాపూర్, 15 జూన్ (నగర నిజం ప్రతినిధి):** సనత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డెక్కన్ జెమ్స్ పాఠశాల ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన సాధనమని, నాణ్యమైన విద్యను అందించే విద్యాసంస్థలు దేశ భవిష్యత్‌కు బలమైన పునాదులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యతలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య అనేది కేవలం ఉపాధి అవకాశాలకే పరిమితం కాకుండా, మంచి పౌరులను తయారు చేసే ప్రక్రియ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కె. లక్ష్మి బాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తోడ్పడే విద్యాసంస్థలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు మొహమ్మద్ హబీబుద్దీన్, మొహమ్మద్ నవాజ్ ఖాన్, మొహమ్మద్ ఇల్యాసుద్దీన్ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి విద్యను స్థానిక విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో డెక్కన్ జెమ్స్ పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల మేధో వికా



## కేపీహెచ్‌బీ కాలనీలో ఘనంగా మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు



**కూకట్పల్లి జూన్ 15,(నగర నిజం ప్రతినిధి):** సోమవారం కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజామనిషి, సామాజిక సేవకులు మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, అనుచరులు, మిత్రులు స్థానిక ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛాలు, గజమాలలతో సన్మానించారు. బాణాసంచా కాల్చి, జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, మందలపు సాయిబాబు చౌదరి గత 25 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. కరోనా కాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ, వరదలు, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పేదలకు వైద్య సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ స్వయంగా మందలపు సాయిబాబు చౌదరి కి బొకే అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, మందలపు సాయిబాబు చౌదరి ప్రజల కోసం నిరంతరం సేవ చేస్తున్న నాయకుడు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ఇంకా ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరుకుంటున్నాను. సమాజానికి ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమైనవి అని పేర్కొన్నారు. అలాగే ఆయనకు ఆశీర్వాదాలు అందజేస్తూ, ఆయురారోగ్యాలతో ఉండి ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అభిమానులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు మందలపు సాయిబాబు చౌదరి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

## ప్రభుత్వ భాగస్వామ్యంలో విస్తరణ చేపట్టాల్సి ఉంది




**హైదరాబాద్,నగర నిజం:** హైదరాబాద్ మహానగరానికి అత్యంత ఆవశ్యకత కలిగిన మెట్రో విస్తరణ చేపట్టడానికి వీలుగా, ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి అన్ని రకాల ఒప్పందాలు కుదిరినప్పటికీ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి నిధులు ఎందుకు విడుదల కాలేదని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, వాకిటి శ్రీహరి గారు, మహమ్మద్ అజారుద్దీన్ గారు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి గారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో మొదటి దశ స్వాధీనం, నిధుల సమీకరణ, రెండో దశ విస్తరణ అంశాలపై సవివరంగా తెలిపారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించడానికి మెట్రో రైలు విస్తరణ ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇస్తే కేంద్రం వాటా లేకుండానే వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

### మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు

- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,నగర నిజం:** హైదరాబాద్ విస్తరణను అడ్డుకుంటుందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెట్రో టేకోవర్ కావాల్సిన ఐఆర్ఎఫ్‌సీ రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అంతా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. కానీ, కిషన్‌రెడ్డి తన సహచర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. రుణం మంజూర్ కాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. జపాన్ నుంచి నిధులు కూడా వచ్చాయని రేవంత్ తెలిపారు. కానీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాజకీయంగా నష్టం జరుగుతుందనే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసే మెంట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని తెలిపారు.

## అడ్డగుట్ట డివిజన్‌లో ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమం





**సికింద్రాబాద్, 15 జూన్ (నగర నిజం) :** సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అడ్డగుట్ట డివిజన్ లాలాగూడ ఇందిరానగర్ సి కాలనీ 108వ బూత్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, అవసరమైన నమోదు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటరు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొన్నాల రాజు, బి. నర్సింగ్, హనుమంతరావు, హెచ్. రామచందర్, సుధాకర్, వెంకటస్వామి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## ప్రాణభయంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తాళ్లపల్లి గడ్డ తండా కుటుంబం

- లైఫ్ అండ్ హెల్త్ సెటిల్మెంట్ చేయాలని బాధితుడి విజ్ఞప్తి
- భూమి వివాదంలో న్యాయం చేయాలని ప్రజావాణిలో వినతి

**మెదక్ బ్యూరో నగర నిజం :, జూన్ 16:** మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని తాళ్లపల్లి గడ్డ తండాకు చెందిన గుగులోతు రవీందర్ జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తండ్రి, తల్లి, అక్కతో పాటు తనకు కూడా భద్రత కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. భూమిని అక్రమంగా లాక్కొని, కొన్ని సంవత్సరాలుగా తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి



చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తిండి కూడా పెట్టకుండా వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. అనంతరం బాధితులు మీడియాతో మాట్లాడుతూ తమ సమస్యను అధికారులు పరిష్కరించాలని కోరారు.

## పశ్చిమాసియాలో శాంతికి మార్గం..



**హైదరాబాద్,నగర నిజం:** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. “ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి” అని ట్రంప్ తన ‘ట్రూత్ సోషల్’ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం” అని పేర్కొన్నారు.

# అమెరికా తెలుగు అసోసియేషన్ క్లాసికల్ డ్యాన్స్ పోటీల్లో హీరాకు ప్రథమ బహుమతి





● అట్లాంటాలో అమెరికా తెలుగు

**అసోసియేషన్ నిర్వహించిన క్లాసికల్ డ్యాన్స్**

**పోటీలలో ప్రథమ బహుమతి అందుకున్న హీరా**

**అట్లాంటా, 15 జూన్ (నగర నిజం) :**అమెరికా తెలుగు అసోసియేషన్ (ఏటీఏ) ఆధ్వర్యంలో అట్లాంటాలో నిర్వహించిన క్లాసికల్ డ్యాన్స్ పోటీలలో భారతీయ సాంప్రదాయ నృత్య ప్రదర్శనతో ప్రతిభ చాటిన చిన్నారి హీరా ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా హీరా అందించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులు, న్యాయనిర్ణేతలు, పాత్రికేయులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ విజయానికి ఆమె గురువు కీర్తి సంజీవ్ అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించాయి. సిద్ధివినాయక నృత్యాలయం ద్వారా అక్కడి వారికి శాస్త్రీయ నృత్యంలో శిక్షణ అందిస్తూ భారతీయ కళా వైభవాన్ని అమెరికాలో చాటిచెబుతున్న కీర్తి సంజీవ్‌ను పలువురు అభినందించారు. చిన్న వయస్సులోనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కళాప్రతిభను ప్రదర్శిస్తూ అంతర్జాతీయ వేదికపై తెలుగు వారి కీర్తిని నిలబెట్టిన హీరాను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కళాభిమానులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతీయ నృత్య సంప్రదాయ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటాలని పలువురు ఆకాంక్షించారు.



## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● తాజా మాజీ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, జూన్ 15 ( నగరనిజం ) :** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తాజా మాజీ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్ద అంబర్పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో ధాక్షా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని తాజా మాజీ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇట్టి వైద్య శిబిరంలో పేదలకు బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని వారికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో మేలు చేస్తాయని స్పష్టం చేశారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం నిజంగా హర్షణీయం అన్నారు. ఉచిత వైద్య సేవలను కాలనీల ప్రజలందరూ పొందాలని కోరారు. అలాగే పరిసర ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి వైద్య శిబిరాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని సూచించారు. హాస్పిటల్ వైద్యులను, సిబ్బందిని అభినందించారు. ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం కృషి చేస్తున్న దాక్షా హాస్పిటల్స్ వైద్య బృందానికి, నిర్వాహకులకు వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, సాయినగర్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర నూతన ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన జీనుగురాల బీజేపీ నాయకులు

● గ్రామ ప్రజల రక్షణ కోసం రాత్రి వేళలో

**పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రవీణ్ బాదం విజ్ఞప్తి**



**జూన్ 15,(నగర నిజం ప్రతినిధి)**మహబూబ్ నగర్ దేవరకద్ర పోలీస్ స్టేషన్ నూతన సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ భాస్కర్ రెడ్డిని జీనుగురాల బిజెపి నాయకులు ప్రవీణ్ బాదం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కి శాలువా కప్పి హృదయపూర్వక స్వాగతం మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో భాగంగా గ్రామ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణపై చర్చించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రజల రక్షణ కోసం రెగ్యులర్ పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్ఐ కి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ప్రస్తుత డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్‌లకు అలవాటు పడి, ఆన్‌లైన్ గేమింగ్ మాయలో పడుతున్న యువతను, విద్యార్థులను సరైన మార్గంలో నడిపించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాలపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తేవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ బాదంతో పాటు రవి ఉప్పరి, విజయ్ జంగు, మరియు వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రంగస్థలం కళాకారుల అభిమాన సమైక్యకు నూతన షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



● ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి

● ఎన్జీవోస్ కాలనీ కళాకారుల సంఘం

**ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేసిన**

**మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**

**ఎల్బీనగర్, జూన్ 15 (నగర నిజం):** మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ను వారి కార్యాలయంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో ఎన్జీవోస్ కాలనీకి చెందిన తెలంగాణ రాష్ట్ర రంగస్థలం కళాకారుల అభిమాన సమైక్య ( టిఎస్ఆర్ కె ఏఎస్) సభ్యులు కలిసి నూతన షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, సంస్థ కార్యకలాపాల నిర్వహణకు సరైన వసతులు అవసరవని, అందుకోసం నూతన షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని ఎంపీని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందిస్తూ, కళాకారుల అవసరాలను గుర్తించి నూతన షెడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కళారంగ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రంగస్థలం కళాకారుల అభిమాన సమైక్య అధ్యక్షులు పంపన వెంకటేశ్వర్లు, చీఫ్ అడ్వైజర్ సోమయాజులు, సెక్రటరీ వర్ధిని, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వి.వి. సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి, సభ్యులు నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా ఓటరు మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**సికింద్రాబాద్, 15 జూన్ (నగర నిజం) :** సికింద్రాబాద్ నియోజకవర్గంలోని నార్త్ లాలాగూడ డివిజన్ పరిధిలోని ఇంద్రా నగర్ ప్రాంతంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ఓటరు మ్యాపింగ్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఓటరు వివరాల నమోదు, సవరణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్, గీత, పొన్నాల రాజు, అమర్, గోన సీను, వెంకటేష్, రమేష్, బండ నర్సింగ్, మహేందర్, జావేద్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు. ఓటరు జాబితా ప్రక్రియను విజయవంతం చేయడానికి ప్రతి ఇంటిని సందర్శిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టుశిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

● మైత్రి నగర్‌లో కుట్టుశిక్షణ

**పొందిన మహిళల సమావేశం**

● శిక్షణ పూర్తి చేసిన వారికి


**పీకో మిషన్ల పంపిణీ**



**ఎల్‌బీ నగర్, జూన్ 15 (నగర నిజం):** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్‌లో గతంలో కుట్టుశిక్షణ పొందిన మహిళల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బీ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టుశిక్షణ వంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ అందిస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకువస్తున్న బండి ప్రభావతిని ప్రత్యేకంగా అభినందించి ధన్యవాదాలు తెలిపారు. కుట్టుశిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించుకోగలరని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత అందించే సర్టిఫికెట్ మరిన్ని అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని చెప్పారు. మహిళలు సంపాదన ద్వారా కుటుంబానికి అండగా నిలబడటమే కాకుండా సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని పొందగలరని వివరించారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు స్వయంగా కుట్టిన దుస్తులను ఎమ్మెల్యే పరిశీలించి వారి ప్రతిభను ప్రశంసించారు. జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఒక పీకో మిషన్‌ను అందజేశారు. ఈ మిషన్ ద్వారా మహిళలు అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తిలక్ రావు తన వంతు సహాయంగా మరో పీకో మిషన్ అందజేస్తానని ప్రకటించారు. మహిళలకు ఉపాధి కల్పించే ఇలాంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తోట రాజశేఖర రెడ్డి, శ్రీధర్, ట్రైనర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.




## అంజనపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో శాగ వెంకటేష్ ఘన విజయం





**అంజనపురి, 15 జూన్ (నగర నిజం) :** అంజనపురి కాలనీ ఫేజ్-2 వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం నిర్వహించగా, అధ్యక్ష పదవి కోసం జరిగిన పోటీలో అభ్యర్థి శాగ వెంకటేష్ ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థితో పాటు ఇస్లావత్ రవి పోటీలో నిలిచారు. మొత్తం 60 ఓట్లు పోలవగా, శాగ వెంకటేష్ కు 40 ఓట్లు లభించాయి. ఇస్లావత్ రవికి 19 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లనిదిగా ప్రకటించారు. ఈ సందర్భంగా శాగ వెంకటేష్ మాట్లాడుతూ, తన విజయానికి సహకరించిన కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదల, నివాసితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు.





నగరనిజం

16 మంగళవారం, జూన్ 2026

# ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులుగా మచ్చ అనిల్ కుమార్



**ఇబ్రహీంపట్నం, జూన్ 15 ( నగరనిజం ) :** యాచారం మండల కేంద్రంలోని సాయిశరణం గార్డెన్‌లో ఉప సర్పంచ్‌ల ఫోరం మండల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం ఉప సర్పంచ్‌ల ఫోరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షులుగా గున్గల్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ మచ్చ అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దెంది మధుకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు విస్లావత్ రాజు, సహాయ కార్యదర్శులుగా గౌర నాగరాజు, ఆనమోని రవీందర్, కోశాధికారిగా రెడ్డమోని శిరీష వెంకటేష్ యాదవ్, కమిటీ సభ్యులుగా మంగ కృష్ణ, గౌర లక్ష్మణ్, నాయిని శ్రీకాంత్, అనిత రమేష్, మల్లమ్మ, సువర్ణ, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు మచ్చ అనిల్ కుమార్ మాట్లాడుతూ... ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ తొలగించారంటూ సామాజిక మాధ్యమాలు, మరియు కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో నిస్వార్థంగా పనిచేస్తానని చెప్పారు. ఉప సర్పంచ్‌ల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడతాన న్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు. నాకు సహకరించిన ఉప సర్పంచ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మచ్చ అనిల్ కుమార్, తదితరులను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) చంద్రారెడ్డి



**రంగారెడ్డి ప్రతినిధి, జూన్ 15 ( నగరనిజం ) :** ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (118) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ- 28, ఇతర శాఖలు - 90, మొత్తం 118 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ అనంతరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు

- 17న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- తల్లిదండ్రులంతా భాగస్వామ్యం కావాలి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపు
- కలెక్టర్, సీపీ, విద్యాకమిషన్ ఛైర్మన్ తో కలిసి ఏర్పాట్ల పరిశీలన



**ఇబ్రహీంపట్నం, జూన్ 15 ( నగరనిజం ) :** రాష్ట్రంలో సరికొత్త విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టేలా ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 17న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ స్కూల్ ప్రారంభోత్సవం జరగనుంది. ఈ మేరకు బుధవారం హెలీక్యాప్టర్ లో ఆరుట్లకు చేరుకొని మొదటగా టీపీఎస్ ను ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం, పాఠశాలను సందర్శిస్తారు. తర్వాత, అల్పాహార పథకాన్ని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి, బ్రేక్ ఫాస్ట్ చేయనున్నారు. అక్కడి నుంచి ప్రాథమిక పాఠశాల భవనం సందర్శించి, అక్కడి సౌకర్యాలు, క్రీడాప్రాంగణం, కంప్యూటర్ ల్యాబ్, తదితర సౌకర్యాలు పరిశీలించనున్నారు. 11 గంటల తర్వాత బహిరంగసభకు హాజరుకానున్నారు.

### అధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కలెక్టర్ నారాయణరెడ్డి, సీపీ తరుణ్ జోషి, విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్, బహిరంగసభ వద్ద ఏర్పాట్లను పరిశీలించి, దిశానిర్దేశం చేశారు. అక్కడి నుంచి పాఠశాలను సందర్శించి, సీఎం పర్యటనపై కలెక్టర్, సీపీ, ఇతర అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి, విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి పలుసూచనలు చేశారు. జనసమీకరణ, సౌకర్యాలు, భద్రతకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు.

### తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలి

పదేళ్ల విధ్వంసం తర్వాత 60 ఏళ్ల ఆకాంక్షలకనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ పునఃనిర్మాణం చేపట్టిందని, ఇందులో భాగంగా ఆరుట్ల నుంచి సరికొత్త విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నిన్నమొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూసిన వారే నేడు అడ్మిషన్ల కోసం వెంటబడే పరిస్థితి రావటమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. సర్కార్ సంకల్పంలో తల్లిదండ్రులంతా భాగస్వాములై రేపటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ ప్రాజెక్టు ఇక్కడితో పూర్తికాలేదని, విద్యార్థులందరికీ అత్యుత్తమ విద్యనందించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా పాఠశాలలను ప్రభుత్వం నిర్మించనుందని ఆకునూరి మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# అధిక ఫీజులతో తల్లిదండ్రులపై భారం మోపుతున్న మెడికల్ కాలేజీలు

- తెలంగాణ మెడికో పేరెంట్స్ అసోసియేషన్
- ఎన్ఎంసీ నిబంధనలు పాటించకుండా

### అదనపు ఫీజుల వసూళ్లు చేస్తున్నారని ఆరోపణ





**ఎల్బీనగర్, జూన్ 15 (నగర నిజం):** మెడికల్ కాలేజీలు ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) నిబంధనలను సక్రమంగా అమలు చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని "తెలంగాణ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు పానుగుళ్ల సుజాత" ఆరోపించారు. బండ్లగూడలో నిర్వహించిన తెలంగాణ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ట్యూషన్ ఫీజులకు అదనంగా వివిధ పేర్లతో లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. హాస్టళ్లలో కనీస సదుపాయాలు లేకపోయినా విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అదనపు ఫీజుల విషయంలో ఎలాంటి పారదర్శకత లేకుండా యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని, దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజుల పేరుతో విద్యార్థులను, తల్లిదండ్రులను వేధించే ధోరణిని కాలేజీ యాజమాన్యాలు వెంటనే మార్చుకోవాలని ఆమె హెచ్చరించారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఫీజుల నియంత్రణ విషయంలో ప్రభుత్వం, సంబంధిత నియంత్రణ సంస్థలు జోక్యం చేసుకుని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే తెలంగాణ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ చారి, ఉపాధ్యక్షురాలు పానుగుళ్ల సుజాత, పిడిశెట్టి రమేష్, కె. వెంకటరావు, సంధ్య, గునుగుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కేంద్రం రూ.3,820 కోట్ల ఉపాధి హామీ నిధులు

- రాష్ట్రం మ్యాచింగ్ ఫండ్స్ విడుదల చేయాలి: డా. బూర నర్సయ్య గౌడ్
- గ్రామీణాభివృద్ధి నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ




**హైదరాబాద్, జూన్ 15 (నగర నిజం):** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,820 కోట్ల నిధులను మంజూరు చేసిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్తో పాటు బీజేపీ ప్రజాప్రతినిధుల కృషి వల్ల ఈ భారీ నిధులు రాష్ట్రానికి లభించాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాల కోసం తన వాటాగా 60 శాతం నిధులను ఇప్పటికే విడుదల చేసిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద విడుదల చేయాల్సిన 40 శాతం మ్యాచింగ్ ఫండ్స్‌ను ఇప్పటివరకు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 2,200 కోట్ల మేర తన వాటా నిధులను విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేస్తే మొత్తం రూ. 6,370 కోట్లకు పైగా గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందని డా. బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. ప్రస్తుతం కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు తమ వాటా నిధులను సమకూరుస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాష్ట్ర వాటా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 12,700 గ్రామ పంచాయతీలు నిధులను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన, వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, అమృత్ సరోవర్, కాంపా నిధులు వంటి పథకాల కింద కూడా కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు అందిస్తోందని పేర్కొన్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిందల్లా తన వాటా నిధులను సమకూర్చడమేనన్నారు. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన డా. బూర నర్సయ్య గౌడ్, వెంటనే మ్యాచింగ్ ఫండ్స్ విడుదల చేయకపోతే గ్రామ గ్రామాన ప్రజలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

# బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ డైరెక్టర్స్ నియామకాల్లో శ్రీవైష్ణవులకు 50% కేటాయించాలి

- శ్రీవైష్ణవ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ డిమాండ్



**హైద్రాబాద్ జూన్ 15:** శ్రీవైష్ణవ సేవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ శాఖ ప్రారంభ సర్వసభ్య సమావేశం ఎల్ బి నగర్ లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్య, సంఘ సభ్యులు పొడిచేటి రామకృష్ణమాచార్య, ఫణిహారం శ్రీకాంత్ చార్యులు, ఉత్పల అనంతాచార్య, వాయా ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ కండ్లకుంట యాదగిరాచార్యులు,శ్రీచిలుకమర్రిలక్ష్మీనాథాచార్యులు, సభ్యులు శ్రీభాష్యం యదు మోహన్, ముడుంబ మాధవాచార్య తదితరులు పాల్గొన్నారు.సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ గారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను స్మార్తులతో భర్తీచేసి, శ్రీవైష్ణవులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కనీసం డైరెక్టర్స్ నియామకాల్లోనైనా శ్రీవైష్ణవులకు 50% కేటాయించి వెంటనే నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్యమాట్లాడుతూ..ఆర్థికంగా వెనుకబడిన శ్రీవైష్ణవులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్ని జిల్లాల్లో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 24వ తేదీన సంఘం నిర్వహించనున్న ఉచిత సామూహిక ఉపనయనాలకు 50 మంది వటువులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. తర్వాత గ్రేటర్ హైదరాబాద్ అడ్ హక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా పొడిచేటి రామకృష్ణమాచార్య, కో-కన్వీనర్లుగా ఫణిహారం శ్రీకాంత్ కృష్ణమాచార్య, తాండ్ర్యాల శ్రీనివాస చక్రవర్తి, చిలుకమర్రి కవీంద్రాచార్యులు, శేషభట్టర్ శ్రీకాంతాచార్య, బెల్లంకొండ ప్రవీణ్ కుమార్, తాండ్ర్యాల కృష్ణమోహన్, శ్రీభాష్యం హరికిషన్, కొండపాక కృష్ణమాచార్య, కాందూరి శరత్ వంశీ, మురళీ వెంకటాచార్య, చక్రవర్తుల రవికుమారాచార్య మరియు వీరితోపాటుగా 15 మందిని కార్యవర్గ సభ్యుల ఎంపిక కూడా జరిగింది.

# భారీ వర్షాల నేపథ్యంలో వరద నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యల కోసం అధికారుల పర్యటన





- మున్సిపల్ మరియు hydraa అధికారులతో కలిసి సందర్శించిన తుంగతుర్తి రవి
- భారీ వరదల ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం గా SNDP ప్రాజెక్టు ను పూర్తి చేయాలి - తుంగతుర్తి రవి

**మేడిపల్లి :15జూన్ (నగర నిజం ):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, మేడిపల్లి మరియు పీర్జాదిగూడ డివిజన్లలో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించినప్పుడు నీరు నిల్వకుండా ఉండేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించడానికి మున్సిపల్ అధికారులు, HYDRA అధికారులు మరియు పోలీస్ శాఖ సిబ్బంది సంయుక్తంగా పర్యటించారు. ఈ సందర్భంగా వరంగల్ రహదారితో పాటు మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో గతంలో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించి, నీటి పారుదల పరిస్థితులను పరిశీలించారు. తుంగతుర్తి రవి అధికారులకు ఆయా ముంపు ప్రాంతాలను చూపించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వర్షాకాలంలో వరద నీరు వేగంగా వెళ్లిపోయేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, అడ్డంకులను తొలగించడం, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అలాగే ఈ వరదలకు శాశ్వత పరిష్కారంగా రాచీణూ ప్రాజెక్టును నిర్మించి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తే వరదలకు చెక్ పెట్టొచని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు పరిస్థితిని సమీక్షించి, భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడతామని తెలిపారు. నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న సమస్యలను గుర్తించి, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలోబాజా మోహన్ కుమార్ గారు, శంకరయ్య గారు, ట్రాఫిక్ CI రవీందర్ గారు,HYDRA అధికారి మోహన్ రావు గారు, మున్సిపల్ (EE )రమేష్ బాబు, సాయినాథ్ గౌడ్ గారు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, వర్క్ ఇన్స్పెక్టర్లు,మున్సిపల్ సిబ్బంది, HYDRA సిబ్బంది, DRF సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగాచారి, అంజిరెడ్డి, బర్రె నాగరాజు,సోమయ్య, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

- జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్





**మెదక్ బ్యూరో : నగర నిజం : మెదక్ 15 జూన్ 2026:** సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యలు పరుష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వచ్చే సోమవారం వరకు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తులు అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ పుట్టకోట ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల పంపిణీ

- జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలి: కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్
- ప్రభుత్వ పాఠశాలల సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈఓ సత్యనారాయణ



**మెదక్ బ్యూరో : నగర నిజం: తూప్రాన్, జూన్ 15:**మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని పుట్టకోట ప్రాథమిక పాఠశాలలో సోమవారం పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, 4వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని కోరారు. పుట్టకోట ప్రాథమిక పాఠశాలను జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పలువురు పాల్గొన్నారు.

## మైతాపూర్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ



**రాయికల్ జూన్ 15 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి నాగమణి, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు శ్యామల, నాయకుడు తలారి రాజేష్, ఉపాధ్యాయులు మధు, కార్తీక్, గిరిధర్, గంగారాజం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం పండుగ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) చంద్రారెడ్డి



**రంగారెడ్డి ప్రతినిధి, జూన్ 15 ( నగరనిజం ) :** మొహరం పండుగ ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) కలెక్టరేట్లో 2026 మొహర్రం పండుగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. మైనారిటీ వర్గాల పెద్దలు మొహర్రం పండుగ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వారు లేవనెత్తిన సమస్యలపై సమగ్రంగా చర్చించి సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, మొహర్రం వేడుకలు ప్రశాంతంగా, సంతోషకర వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొహర్రం పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకొని, శాంతి భద్రతలు మరియు ప్రాథమిక సౌకర్యాల కల్పనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, పంచాయతీ రాజ్, రోడ్లు మరియు భవనాల శాఖ), అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, వైద్యారోగ్య శాఖ, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ శాఖల అధికారులు, మైనారిటీ వర్గాల పెద్దలు పాల్గొన్నారు.


# తుమ్మ చెరువు అభివృద్ధి, నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలి



- డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

**మేడ్చల్, జూన్ 15 (నగరం నిజం):**మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి భూగర్భ జలాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని, అలాగే హౌసింగ్ బోర్డు నుండి లైబ్రరీ వరకు నూతన రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ తుమ్మ చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగిస్తే భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చెరువులోకి డ్రైనేజీ నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని, చెరువు పరిసరాల్లో ఆధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా చెరువును అభివృద్ధి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హౌసింగ్ బోర్డు నుండి లైబ్రరీ వరకు ఉన్న రహదారి ప్రభుత్వ కార్యాలయాలు, మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. రహదారి దెబ్బతిన్న కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే నూతన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమదాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శులు సురేందర్ రెడ్డి, విష్ణు, కార్యవర్గ సభ్యులు శ్రీపాల్, సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, పాతూరి సుధాకర్ రెడ్డి, కవిరాజు, బీజేవైఎం కార్యదర్శి భరత్ వంజరి, నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, బొజ్జ వంశీ రెడ్డి, మామిళ్ల నర్సింగ్ రావు, ఎన్.ఎస్. గౌడ్, బాబు గౌడ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## పేద కుయుముబాన్ని ఆదుకున్న వెస్సో ట్రస్ట్




**హైదరాబాద్ జూన్ 15;** రామన్నగూడెం, బుట్టాయగూడెం మండలం, ప.గో జిల్లా నివాసి లక్కోజు కనకదుర్గ (63) గత కొన్ని సంవత్సరాలుగా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమిత మయ్యారు. ఆమె భర్త వెంకటేశ్వర రావు (72) గతంలో వడ్రంగి వృత్తి చేసేవారు. అయితే వృద్ధాప్యం మరియు అనారోగ్య కారణాల వల్ల ప్రస్తుతం ఉపాధి పొందలేక పోతున్నారు. వైద్య ఖర్చులను భరించడానికి కనకదుర్గ కుటుంబం తమ ఇల్లు, స్థలం, బంగారు ఆభరణాలు సహా, ఉన్న అన్ని ఆస్తులను విక్రయించింది. వారి ఇద్దరు వివాహిత కుమార్తెలు కూడా తమ శక్తి మేరకు సహాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు వైద్య అవసరాల కోసం సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం కుటుంబం అన్ని వనరులను కోల్పోయి, ఇకపై చికిత్స ఖర్చులను భరించే స్థితిలో లేదు! ఈ క్లిష్ట పరిస్థితుల్లో, వారి బంధువు మరియు సామాజిక కార్యకర్త విస్సాకోటి నాగ వెంకట సత్యనారాయణ ద్వారా కనకదుర్గ కుటుంబ సభ్యులు వెస్సో ట్రస్ట్ ను సంప్రదించి ఆమె వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించమని అభ్యర్థించారు.స్పందించిన వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారం తో బ్రహ్మశ్రీ ఐతీ. కే యం కిరణ్ కుమార్ గారి (ఏసిపి, ఆర్థిక నేరాల విభాగం, సి సి ఎస్, హైదరాబాద్) చేతుల మీదుగా లబ్ధిదారు బంధువు సత్యనారాయణ కు 54,400/- రూపాయల చెక్ అందజేశారు. దీజీవీజ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ ఐతీ. వి వి నాగార్జున నాగోజు వారి పంజాగుట్ట కార్యాలయంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఇడికోజు వెంకటాచారి, విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ కార్యదర్శి పివిఆర్కె ప్రసాద్, విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ అధ్యక్షులు విశ్వనాధుల పుష్పగిరి, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు రాయపల్లి కృష్ణమాచారి, దయానంద చారి పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



**ఇబ్రహీంపట్నం, జూన్ 15 ( నగరనిజం ) :** కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 10 నెంబర్ లో పూసల కులాన్ని డీఎన్ఏ జాబితాలో చేర్చి, పూసల కులంతో పాటు 51 కులాలను డీఎన్టీలో పొందుపరిచి అధికారికంగా జీవో విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో పూసల సంఘం నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం జిల్లా అధ్యక్షులు నూతనగంటి సదానందం, పూసల అభివృద్ధి వేదిక అధ్యక్షులు నూతనగంటి పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి పన్నీరు వెంకటేష్, సీనియర్ నాయకులు వెంకటేష్, కుమార్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# కేబీఆర్ పార్కుకు ధీటుగా బి.ఎన్.రెడ్డి నగర్‌లో 116 ఎకరాల్లో ఆహ్లాదకర పార్కు అభివృద్ధి





- మధుయాష్కి గౌడ్
- ఈనెల 18న సీఎం రేవంత్ రెడ్డి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు

ఎల్బీనగర్, జూన్ 15 (నగర నిజం): బి.ఎన్.రెడ్డి నగర్ ప్రాంత ప్రజలకు కేబీఆర్ పార్కు తరహాలో ఆహ్లాదకరమైన వాతావరణంలో 116 ఎకరాల విస్తీర్ణంలో అద్భుతమైన పార్కు అందుబాటులోకి రానుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఈనెల 18న బి.ఎన్.రెడ్డి నగర్‌ను ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న వన మహోత్సవ కార్యక్రమం నేపథ్యంలో సోమవారం అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ప్రియాంక వర్గీస్, డీఎఫ్‌వో రోహిత్ రెడ్డి, ఏసీపీ కాశీ రెడ్డితో కలిసి కార్యక్రమ స్థలాన్ని సందర్శించారు. మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, 30 ఏళ్లుగా కొనసాగుతున్న స్థల వివాదాన్ని ప్రజా ప్రభుత్వం పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తోందన్నారు. పార్కు అభివృద్ధితో పాటు రూ.20 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైన్లు, డ్రైనేజీ లైన్ల నిర్మాణం చేపట్టి పరిసర ప్రాంతాల్లో వరద, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం నగరాభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం హైదరాబాద్ ప్రజల అవసరాలకే నిధులను వినియోగిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు జరిగే వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిసర కాలనీల ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శ్రీనివాస్, ఎఫ్‌డీవో బాబ్జీరావు, వెంకటయ్య, ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, మాజీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు, మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, పర్వతి గణేష్ రెడ్డి, రఘుమారెడ్డి, భీమిలి రామకృష్ణారెడ్డి, కళ్లెం సుజాతా రెడ్డి, రజిని రావు, రాజేశ్వరి, వసంత, భాను, మెరుగు రమేష్ రెడ్డి, వినయ్ పటేల్, చంద్రకాంత్ గౌడ్, శ్రీనాథ్, బద్రీనాథ్, ఆల వెంకటరెడ్డి, షేక్ షాకీర్, ప్రవీణ్ రెడ్డి, సూర్యనారాయణ, చిరంజీవి గౌడ్, రాజశేఖర్ రెడ్డి, రేణు గౌడ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, మనీష్ గౌడ్, సుధాకర్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, నంద కిషోర్, భవాని, లక్ష్మణ్ గౌడ్, వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**మెదక్ బ్యూరో : నగర నిజం :** సంగారెడ్డి, జూన్ 15:- ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం చేయరాదని చెప్పారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌లో 31, సంగారెడ్డి డివిజన్‌కు 15, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 10, జహీరాబాద్ డివిజన్‌లో 6 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత




**మేడ్చల్, జూన్ 15 (నగర నిజం):** గుండ్లపోచంపల్లి 33/11 కేవీ విద్యుత్ ఉపకేం ద్రం పరిధిలోని లక్ష్మీనగర్ ఫీడర్ లో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనులు చేపట్టనున్నం దున రేపు (జూన్ 16, మంగళవారం) విద్యుత్ సరఫ రాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉండనుంది. ఈ సమయంలో లక్ష్మీనగర్, మాణిక్‌రెడ్డి నగర్, ఊర్జితాస్ విల్లాస్-2, ఊర్జితాస్ విల్లాస్-3, సంజనా అపార్ట్‌మెంట్లు, ప్రైమస్ ఎప్సిలాన్స్, ప్రెస్టీజ్ గ్రీన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఈ ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని తెలిపారు.

## మానసిక వ్యాధిగ్రస్తులకు సమాజం అండగా నిలవాలి

- డాక్టర్ లోకేష్ చౌహాన్




**ఎల్బీనగర్, జూన్ 15 (నగర నిజం):** మానసిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సమాజం అండగా నిలిచి సహాయం చేయాలని ప్రముఖ ఉస్మానియా సైకియాట్రిస్ట్ డాక్టర్ లోకేష్ చౌహాన్ పిలుపునిచ్చారు. నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలోని మీన్స్ మెంటల్ హెల్త్ కేర్ హోమ్‌ను సోమవారం రామంతపూర్ ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా హోమ్‌లో చికిత్స పొందుతున్న మానసిక రోగులతో మాట్లాడి వారి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ లోకేష్ చౌహాన్ మాట్లాడుతూ, మానసిక ఆరోగ్య సమస్యలపై వైద్య విద్యార్థులు ప్రత్యేక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మానసిక వ్యాధిగ్రస్తులకు హోమియోపతి వైద్యం ద్వారా కూడా సేవలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. మీన్స్ మెంటల్ హెల్త్ కేర్ హోమ్‌లో డాక్టర్ జ్ఞాన ప్రకాష్ ఎన్నో సంవత్సరాలుగా రోగులకు సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా ఈ కేంద్రాన్ని నిర్వహిస్తూ మానసిక రోగులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వారికి కుటుంబ సభ్యులతో పాటు సమాజం కూడా అండగా నిలవాలని కోరారు. మానసిక ఆరోగ్య సేవల పట్ల ఆసక్తి చూపుతున్న హోమియోపతి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ

## ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రుల మొగ్గు..





- బాటసింగారంలో అడ్మిషన్ల జోరు

**అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 15 (నగర నిజం):** నాణ్యమైన విద్య, మెరుగైన ఫలితాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల కారణంగా బాటసింగారం ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారం భం సందర్భంగా నిర్వహించిన అడ్మిషన్ అవగా హన కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి, ప్రధానోపాధ్యాయుడు దాసరి ప్రతాప్, ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా గత ఏడాది ఎస్ఎస్‌సీ ఫలితాల్లో పాఠశాల 98.55 శాతం ఉత్తీర్ణత సాధించడం, క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరచడం, కంప్యూటర్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం వంటి అంశాలను వివరించారు. ప్రచార కార్యక్రమం అనంతరం సుమారు 20 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ఆసక్తి వ్యక్తం చేయడం విశేషం. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చిల్కూరు వార్డు ఆఫీస్ మొయినాబాద్ మున్సిపాలిటీలో ఘనంగా యోగా వాక్ మరియు కామన్ యోగా ప్రోటోకాల్ నిర్వహణ



**మొయినాబాద్, జూన్ 15 (నగర నిజం):** చిల్కూరు వార్డు ఆఫీస్ మొయినాబాద్ మున్సిపాలిటీ లో ఘనంగా 'యోగా వాక్' మరియు 'కామన్ యోగా ప్రోటోకాల్' నిర్వహణ వేదిక: చిల్కూరు వార్డు ఆఫీస్, మొయినాబాద్ మున్సిపాలిటీ సమయం: ఉదయం 9:00 గంటలకు మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిల్కూరు వార్డు ఆఫీస్ లో అన్ని వయసుల వారిని భాగస్వామ్యం చేస్తూ నేడు ఉదయం "యోగా వాక్"మరియు "కామన్ యోగా ప్రోటోకాల్" కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ వాలంటీర్లు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మరియు ప్రముఖులు: ఈ ఆరోగ్య అవగాహన కార్యక్రమానికి పలువురు వైద్యులు మరియు ప్రముఖులు హాజరయ్యారు డాక్టర్ సంయుక్త రాణి, యల్గని మహేశ్వరి గౌడ్ (యోగా శిక్షకులు), పల్లె దవాఖానా డాక్టర్ సాయిబాబా, అనిత (ఎ.ఎన్.ఎం),ఆశా కార్యకర్తలు: లత, వందన, విజయలక్ష్మి, సునీత

సమాజంలో యోగా పట్ల అవగాహన పెంచేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా యోగా శిక్షకులు మహేశ్వరి గౌడ్ మరియు వైద్య బృందం మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని పిలుపునిచ్చారు.

## తరచూ రక్తదానం ఇవ్వటం వలన క్యాన్సర్ ముప్పు తప్పుతుంది


- రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి



**వికారాబాద్ జూన్15 :** ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు తాండూరులోని బెల్కటూర్ యందుగల ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ యందు స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తరచూ రక్తదానం ఇవ్వటం వలన క్యాన్సర్ ముప్పు తప్పుతుంది అని సంవత్సరంలో ఒక్కసారైనా ఇస్తే గుండెపోటు ముప్పు 88% మేర తగ్గించుకోవచ్చు అని రక్తంలో ఉండే అధిక శాతం ఇనుము వల్ల రక్తనాళాలు పూడికపోయి గుండెపోటు ముప్పు ఉంటుంది అని. రక్తదానముతో ఈ ఇనుము నిల్వలు తగ్గుతాయి అని తద్వారా కాలేయము ఆరోగ్యముగా బాగుంటుంది అని ఒక్కసారి రక్తదానం చేయడం వలన 650 కిలో క్యాలరీలు తగ్గినట్లే అని ఈ ప్రక్రియ ద్వారా శరీర బరువు అదుపులోకి వస్తుంది అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. 266 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని రక్తదానం చేసిన ప్రతి ఒక్క రక్తదాతను అభినందించారు. ఆ రక్తాన్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తాండూరు లోని రక్త నిధి కేంద్రము మరియు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్ యందు గల రక్త నిధి కేంద్రము వారు పాల్గొని ఆ రక్తాన్ని సేకరించారని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి పేర్కొన్నారు.

## నిర్వహణ పనుల కోసం నేడు విద్యుత్ అంతరాయం

- గౌడవెల్లి ఉపకేంద్రం పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేత




**మేడ్చల్, జూన్ 15 (నగర నిజం):** చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ ఫీడర్ల నిర్వహ ణ పనుల కారణంగా గౌడవెల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం (జూన్ 16) విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్న ట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మొదటి విడతలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గౌడవెల్లి ఉపకేంద్రం పరిధిలోని ఐడీఏ గౌడవెల్లి ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా పొందుతున్న పారిశ్రామిక ప్రాంతం, సాన్వి సుకృతి విల్లాస్, బృందావన్ బిల్డర్స్ ప్రాంతా ల్లో విద్యుత్ అంతరాయం ఉండనుం ది. అదేవిధంగా రెండో విడతలో మధ్యా హ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐడీఏ బాసర్‌గాడి ఫీడర్ పరిధిలోని జ్ఞానాపూర్ గ్రామం, బాసర్‌గాడి పారిశ్రామిక ప్రాంతం, బాసర్‌గాడి గ్రామ ం, జ్ఞానాపూర్ పారిశ్రామిక ప్రాంతం ల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. నిర్వహణ పనుల ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చడం, చెట్ల కొమ్మల వల్ల ఏర్పడే అంతరాయాలను నివారించడం లక్ష్యమని తెలిపారు. సంబంధిత ప్రాంతాల ప్రజలు, పారిశ్రామిక సంస్థలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. పనులు పూర్తయి న వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధ రించబడుతుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

# కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్ల ప్రదానం





- జి.ఏ.జి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూరెళ్ల వేములయ్య గౌడ్

**ఎల్బీనగర్, జూన్ 15 (నగర నిజం):** వనస్థలిపురం డివిజన్ చింతలకుంట గ్రౌండ్‌లో జి.ఏ.జి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే శిక్షణలో వివిధ స్థాయిలను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అకాడమీ వ్యవస్థాపకుడు, కరాటే మాస్టర్ గట్టు అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూరెళ్ల వేములయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి బత్తిని సురేందర్ గౌడ్, వనస్థలిపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ గంధం శాంతి కుమార్ గౌడ్, హోంశాఖ కార్యాలయ సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్ గౌడ్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక యువకులు బైరి శివాగౌడ్, రోహిత్, కూరెళ్ల తనుజ్ గౌడ్, హరీష్, కూరెళ్ల సాత్విక్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

# ఊటుపల్లి వద్ద దర్జాగా పెద్ద కాలువ కబ్జా







- కాలువను చదును చేస్తూ ఆక్రమించుకుంటున్న అక్రమార్కులు
- అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికుల ఆగ్రహం

రాజేంద్రనగర్, జూన్ 15 (నగరనిజం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ పరిధిలో భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రభుత్వ భూములకు రెక్కలొస్తున్నాయి. కాదేది కబ్జాకు అనర్హం అన్న చందంగా రెచ్చిపోతున్న అక్రమార్కులు.... ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని ఊటుపల్లి వద్ద పెద్ద కాల్వకు ఎసరు పెట్టారు కొందరు అక్రమార్కులు. పెద్ద కాలువ అంచున భూమిని చదును చేస్తూ బఫర్ జోన్ భూమిని ఆక్రమించేస్తునట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని ఊటుపల్లి గ్రామం మీదుగా పురాతన పెద్ద కాలువ (ఫిరంగి కాలువ) ఉంది. నిజాం నవాబుల కాలం నాడు హైదరాబాద్ జంట జలాశయాలను నింపడానికి గొలుసు కట్టు మాదిరిగా ఈ కాలువలను నిర్మించారు. అయితే శంషాబాద్ వద్ద రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తో పాటు హైదరాబాద్ కు మణిహారంగా నిర్మించిన నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు రాకతో శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. గజం భూమి ధర వేల నుండి లక్షల్లో పెరిగిపోయాయి. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు కర్చీఫ్ వేసేస్తున్నారు. చెరువులు,కుంటలతో పాటు కాలువలను సైతం దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. ఊటుపల్లి మీదుగా నిజాం నవాబుల కాలంలో నిర్మించిన పెద్ద కాలువ ప్రస్తుతం అన్యాక్రాంతమవుతోంది. కాలువకు రెండు వైపులా పట్టా భూములు కొనుగోలు చేసిన కొందరు.... అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని దర్జాగా పెద్ద కాలువను కబ్జా చేసేస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలువకు రెండు వైపులా పఫర్ జోన్ భూమిని చదును చేస్తూ ఆక్రమించుకుంటున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారుతుంది. ఊటుపల్లి వద్ద పెద్ద కాల్వ కబ్జా వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారులతో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులతో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి పెద్ద కాలువ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా కోట్లాది రూపాయల విలువచేసే పెద్ద కాలువ భూములను కబ్జా చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థులు సమాజానికి సంపద.. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కేజీబీవీ పాఠశాలలో ఘనంగా జన్మదిన వేడుకలు..

విద్యార్థులకు పలు వరాలు ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి



**మొయినాబాద్, జూన్ 15 (నగర నిజం):** విద్యార్థులు రాష్ట్రానికి విలువైన వనరులు, సమాజానికి సంపద అని, వారి భవిష్యత్తే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మొయినాబాద్ మండలంలోని నజీబ్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో తన జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసిన ఉప ముఖ్యమంత్రి, వారికి పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేసి ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యంగ్ ఇండియా పాఠశాలల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 29 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పౌష్టికాహార అల్పాహారం అందిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థినుల విజ్ఞప్తికి స్పందించిన భట్టి విక్రమార్క రాష్ట్రంలోని ప్రతి గురుకులంలో సోలార్ గీజర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధ్యాయుల రవాణా సమస్యను పరిష్కరించి పాఠశాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లంబాడా గిరిజనులకు అండగా నిలిచే ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం



తెలంగాణ హైదరాబాద్: నగర నిజం జూన్ 15 సోమవారం నాడు గాంధీ భవన్లో తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో రిజర్వేషన్లపై విస్తృతమైన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది . దీని ముఖ్య ఉద్దేశం గత 50 సంవత్సరాల ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో బంజారా లంబాడా ఆదివాసి ఎరుకల కులాలకు ఎస్టీలను షెడ్యూల్ ట్రైబల్ గా గుర్తించిన 1976 సంవత్సరంలో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ రిజర్వేషన్ కల్పించడం జరిగింది . కాంగ్రెస్ ప్రభుత్వం ఈనాటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం గిరిజనుల పట్ల సానుకూలంగా స్పందిస్తూ రిజర్వేషన్ శాతాన్ని పొడిగించాలని గెజిట్ విడుదల చేయడం జరిగింది . ఇట్టి సందేశాన్ని తెలంగాణలో ఉన్న తండాలు గూడాలలో బస్సు యాత్ర చేపట్టాలని తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ నిర్ణయం తీసుకోవడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్ ఎమ్మెల్యేలు రామచంద్రనాయక్ బాలు నాయక్ రాములు నాయక్ ఆనాటి రిజర్వేషన్లు పోరాటం చేసిన రవీంద్ర నాయక్ ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా చైర్మన్ లింగం నాయక్ నాగర్ కర్నూల్ నియోజకవర్గ నాయకులు ప్రేమ్ నాయక్ వల్య నాయక్ వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావడం జరిగింది

# ఉపాధ్యాయులకు ఎస్‌బీఐ స్వాగతం.. పెన్నులు, స్వీట్లు పంపిణీ



**రాయికల్ జూన్ 16 (నగర నిజం)** పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాయికల్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు, ఉర్దూ మీడియం, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు పెన్నులు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కె. సంతోష్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సిబ్బంది డి. హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జి. రమేష్, నర్సయ్య, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ, పి. రమేష్, ఎల్. రాజారెడ్డి, పి. శ్రీనివాస్, ఎం. స్వరూప, వి. గంగారాజం, ఎం. రవీందర్, సీఆర్‌పీ కె. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ప్రతి ఒక్క వికలాంగునికి సంక్షేమ పథకాలు అందాలి



**వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 15** వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో సోమవారం నాడు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని వికలాంగులకు అంటగా నిలిచే రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వం వికలాంగుల రాక్ష్యకుడు అడ్లూరి లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య గారు వికలాంగుల చెంతకు వీరయ్య-2 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా వికలాంగుల నుంచి అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, మోటర్ వెహికల్, సదరం ధృవ పత్రాల సమస్యలు, ఉపాధి కోసం వికలాంగులు వినతి పత్రాలు టి జీ విసిసి చైర్మన్ ముత్తినేని వీరయ్య అందించారు. ఈ కార్యక్రమశీలో కాంగ్రెస్ వికలాంగుల విభాగ సభ్యత్వ నమోదు కార్యక్రమం దివ్యాంగులతో ముఖాముఖి సమావేశం -వికలాంగుల చెంతకు వీరయ్య -2" ప్రత్యేక గ్రీవెన్స్ పరిష్కార కార్యక్రమం మరియు ఎస్ ఐ ఆర్ అవగాహన సదస్సు సంక్షేమ కార్యక్రమాల ప్రగతి సమీక్ష మరియు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు గత 60 రోజుల్లో 29 జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించిన అనుభవంతో, తెలంగాణలోని ప్రతి దివ్యాంగుడి చెంతకు చేరుకుని వారి సాధికారత కోసం మా ప్రయాణం నిరంతరం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు ం భాను కుమార్, ఎన్ పి ఆర్ డి వికలాంగుల పట్టణ అధ్యక్షులు, మధిర శ్రీశైలం ఎన్ పి ఆర్ డి ఇండియా మధు, వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు మీసాల మోహన్, విహెచ్పి శ్రీను ,అన్ని గ్రామాల దివ్యాంగుల సోదరులు,వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జా చేసిన బీఆర్ఎస్ నాయకులపై చర్య తీసుకోవాలని బాలాపూర్ మండల ఎమ్మార్వోకు ఫిర్యాదు






**మీర్పేట్ జూన్ 15 (నగర నిజం):**బడంగ్పేట్ సర్కిల్ మీర్పేట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 161లో ఉన్న సుమారు 1 ఎకరం 13 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా కబ్జా చేశారని ఆరోపిస్తూ మాజీ కార్పొరేటర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి రాజు సోమవారం బాలాపూర్ మండల తహసీల్దార్ (ఎంఆర్వో)కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా, ఆ భూమిపై హక్కులు ఉన్నట్లు చూయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, భూమి కబ్జా వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే, సంబంధిత భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీన పరచుకోవాలని అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను కోరారు. ఈ ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు విచారణ చేపడతామని చెప్పారని ఆమె తెలిపారు.



## ఆలూరు పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ




**రాయికల్ జూన్ 15 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు సోమవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీమనాతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకు రమేష్, లక్ష్మీకాంతం, శంకరయ్య, వినోద్, నరహరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య ఎఫెక్ట్..పాఠశాలల్లో అత్యల్పంగా విద్యార్థుల హాజరు.




**రాయికల్ జూన్ 15 (నగర నిజం)** కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలిరోజు విద్యార్థుల హాజరు తక్కువగా నమోదైంది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ప్రాథమిక , ప్రాథమికోన్నత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అత్యల్ప విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు బాలికలు ఉర్దూ మీడియం లతో పాటు మైతాపూర్ ఇటిక్యాల రామాజీపేట భూపతిపూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు అతి తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. పలు ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోలేదు. అమావాస్య కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించేది తెలిసింది.

## అల్లీపూర్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ



**రాయికల్ జూన్ 15 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి-వెంకటేష్, ఏఏపీసీ చైర్మన్ అంజలి, ఉప సర్పంచ్ వినయ్, వార్డు సభ్యులు ప్రశాంత్, రోజా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో దోషికి 10 ఏళ్ల జైలు శిక్ష





- **ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రభాకర్ రెడ్డి సమర్థవంతమైన వాదనలతో న్యాయం -**

**బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం**

**మేడ్చల్, జూన్ 15 (నగర నిజం):** మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో 2015లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి కె. వెంకటేష్ ఈ తీర్పును ప్రకటించారు.క్రైమ్ నంబర్ 357/2015లో నిందితుడు బబ్బర్ అధికారి అలియాస్ వికాస్ చత్రిపై అత్యాచారం, పోక్సో చట్టం కింద నమోదైన కేసులో విచారణ పూర్తయ్యాక కోర్టు అతడిని దోషిగా నిర్ధారించింది. దీంతో ఐపీసీ సెక్షన్ 376(2)(ఐ), పోక్సో చట్టం సెక్షన్ 42 కింద 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. అలాగే ఐపీసీ సెక్షన్ 448 కింద ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించగా, చెల్లించని పక్షంలో మరో రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది.

**ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రభాకర్ రెడ్డి**

### వాదనలతో శిక్ష

ఈ కేసులో ప్రభుత్వ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రభాకర్ రెడ్డి సమర్థవంతంగా వాదనలు వినిపించి, సాక్ష్యాధారాలను బలంగా కోర్టు ముందు ప్రవేశపెట్టారు. బాధితురాలికి న్యాయం జరిగేలా ఆయన చేసిన కృషి ఫలితంగానే నిందితుడికి శిక్ష పడిందని న్యాయవర్గాలు పేర్కొన్నాయి.

### మేడ్చల్ పోలీసుల కృషికి ఫలితం

ఈ కేసు దర్యాప్తును తొలి దశలో ప్రస్తుతం చిలకలగూడ ఏసీపీగా ఉన్న కె. శశాంక్ రెడ్డి చేపట్టగా, అనంతరం ప్రస్తుతం కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఎస్. రాజశేఖర్ రెడ్డి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ప్రస్తుత మేడ్చల్ ఎస్‌హెచ్‌వో ఎ. సత్యనారాయణ పర్యవేక్షణ అందించారు.అలాగే సీడీవో వి. శ్రీనివాసులు (పీసీ-9864), సీడీవో సి హెచ్ . ప్రియాంక (డబ్ల్యూపీసీ-7091), లైజన్ అధికారి యు. మౌనిక (డబ్ల్యూపీసీ-7080) కేసు విచారణలో సమన్వయంతో పనిచేసి బాధితురాలికి న్యాయం జరిగేలా సహకరించారు.

### బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం

బాధితురాలికి న్యాయం అందించడంతో పాటు జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) ద్వారా రూ.1 లక్షల బాధిత పరిహారం మంజూరు చేయాలని కోర్టు ఆదేశించింది.పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు అధికారులు, మేడ్చల్ పోలీసు సిబ్బంది, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ తీర్పు సాధ్యమైందని అధికారులు తెలిపారు.

# శంషాబాద్‌లో వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి







- **భారీ వర్షాల నేపథ్యంలో జోనల్ కమీషనర్ చంద్రకళ, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తో కలిసి శంషాబాద్ లో పర్యటించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్**
- **జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి సమన్వయంగా విపత్తులను ఎదుర్కోవాలని సిబ్బందిని ఆదేశించిన రంగనాథ్**
- **వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన రంగనాథ్**

**రాజేంద్రనగర్, జూన్ 15 (నగరనిజం ప్రతినిధి):** వర్షాకాలం నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున శంషాబాద్ పరిధిలో విపత్తులను ఎదుర్కోవడానికి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఆదేశించారు. వర్షం విపత్తులను ఎదుర్కోవడానికి జీహెచ్ఎంసీ సిబ్బందితో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఆయన అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మరోవైపు శంషాబాద్ పరిధిలో భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్ సిబ్బందిని ఆదేశించారు. రెండు రోజుల క్రితం గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ లో కురిసిన కుండపోత వర్షానికి హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి తో పాటు కిషన్ గూడ, తొండుపల్లి ప్రాంతాల్లో రైల్వే అండర్పాస్ వంతెనలు వరద ముంపునకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో హైడ్రా కమీషనర్ రంగనాథ్ సోమవారం నాడు శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ, డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తదితరు అధికార యంత్రాంగంతో కలిసి శంషాబాద్ లో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం శంషాబాద్ లో హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారితో పాటు పలుచోట్ల వరద ముంపుకు గురైన ప్రాంతాలను కమీషనర్ రంగనాథ్ పరిశీలించారు. వరద ముంపునకు కారణమైన డ్రైనేజ్ లైన్లు, మ్యాన్ హోల్సును స్వయంగా పరిశీలించారు హైడ్రా కమీషనర్ రంగనాథ్. ఈ సందర్భంగా మాట్లాడిన హైడ్రా కమీషనర్ రంగనాథ్.... ప్రస్తుత వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులతో పాటు సిబ్బందిని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రంగనాథ్ ఆదేశించారు. భారీ వర్షాల పట్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని కమీషనర్ రంగనాథ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బంది పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా పాడైపోయిన మ్యాన్ హోల్స్ ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఆర్జీఐఏ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం, ఆర్.జి.ఐ.ఏ ఇన్స్పెక్టర్ సంజీవ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్ తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు మద్దతు తెలిపిన బిజెపి నాయకులు





**నగర నిజం న్యూస్ 15 జూన్) జవహర్ నగర్:** కార్మికుల న్యాయమైన డిమాండ్లలో భాగంగా, లేబర్ రేటును రూ.400గా, సెంట్రింగ్ చార్జీని రూ.35గా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ సమ్మె నేటితో ఆరో రోజుకు చేరుకుంది రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కమల్ల ఐలయ్య పిలుపు మేరకు బోయినపల్లిలో నిర్వహించిన సెంట్రింగ్ ముట్టడి సభలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతానికి సమ్మెను నేటితో విరమిస్తున్నట్లు ప్రకటించారు రేపటి నుండి ప్రతి కార్మికుడు యథావిధిగా తమ పనులను కొనసాగించాలని సూచించారు అయితే, తాపీ మేస్త్రిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సెంట్రింగ్ వర్గాలు ఇప్పటివరకు క్షమాపణ చెప్పలేదని, ఈ అంశంపై ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ మండల బీజేపీ అధ్యక్షులు కలపూడి జోగారావు మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు రాష్ట్ర నాయకులు సంతోష్ గుప్తా బీజేపీ నాయకులు నాని, కమలాకర్, రాము నాయక్, మల్లికార్జున్ గౌడ్, యాదగిరి ప్రసాద్, దయాకర్, సాయి కుమార్ తదితరులు తదితరులతో కలిసి కార్మిక సంఘం నాయకులకు మద్దతు ప్రకటించారు కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు కొయడ వెంకటేష్ , అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, ఉపాధ్యక్షులు మరాటి బాబు, ట్రెజరర్ కోట్ల చెన్నారెడ్డి, నాయకులు మధుసూదన్ రావు, మాధవ యాదవ్, కొండయ్య, యాదగిరి, వెంకటేష్, ధర్మయ్య, రాములు, బాలరాజ్, సిహెచ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తే ఖబడ్దార్

- **బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు జీవీపీ సాగర్**
- **శంషాబాద్ లో ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని పవిత్ర సాగర్ డిమాండ్**
- **అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదన్న పవిత్ర సాగర్**




**రాజేంద్రనగర్, జూన్ 15 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ లో నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు జీవీపీ సాగర్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీకి అడ్డుకట్ట వేయకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పవిత్ర సాగర్ సోమవారం నాడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. శంషాబాద్ లో కుప్పలు తెప్పలు గా వెలుస్తున్న ప్రైవేటు పాఠశాలలు నిరుపేద విద్యార్థులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితా లతో చెలగాటమాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలు కేవలం వ్యాపార దృక్పథంతోనే తమ పంతాను కొనసాగిస్తున్నాయని ఆయన విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ముక్కు పిండి ఫీజులు వసూలు చేయడమే కాకుండా పాఠశాలల్లో అధిక ధరలకు పాఠ్య పుస్తకాల విక్రయాలు కొనసాగిస్తున్నారని పవిత్ర సాగర్ ఆరోపించారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని జీవీ పవిత్ర సాగర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# 131వ డివిజన్‌లో నీటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కేపీ వివేక్ ప్రత్యేక పర్యటన







**కుత్బుల్లాపూర్, 15 జూన్ (నగర నిజం ప్రతినిధి):** 131వ డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్, బాల్‌రెడ్డి నగర్ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కేపీ వివేక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు వాటర్ బోర్డు అధికారులతో కలిసి ఆయా కాలనీల్లో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి సరఫరా ఇబ్బందులు, తక్కువ ఒత్తిడితో నీరు రావడం, కొన్ని వీధుల్లో సరైన నీటి పంపిణీ లేకపోవడం వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే కేపీ వివేక్, వాటర్ బోర్డు అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాంతంలో నీటి సరఫరా వ్యవస్థను సమీక్షించిన అధికారులు సమస్యలకు గల కారణాలను గుర్తించి, అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు అదనపు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు వివరించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లోపాలు ఉన్నా, నీటి ఒత్తిడి తక్కువగా ఉన్నా వాటిని అత్యవసరంగా సరిచేసి ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్య అంశమని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పర్యటనతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే అధికారులను ఆదేశించడం పట్ల కృతజ



# తాకితే సంగీత స్వరాలు... హంపి స్థూపాల మిస్టరీ వీడింది!

- **హంపీ సంగీత స్తంభాల వెనుక అద్భుత ఇంజినీరింగ్ రహస్యం**
- **ఘనమైన గ్రానైట్ రాయితోనే సంగీత స్వరాలు వెలువడుతున్నాయని వెల్లడి**
- **స్తంభాల పొడవు, మందం ఆధారంగా స్వరాల తీవ్రతలో మార్పులు**
- **విజయనగర కాలంలో నృత్య ప్రదర్శనల కోసం నిర్మాణం**
- **పరిరక్షణ చర్యల్లో భాగంగా స్తంభాలను తాకడంపై నిషేధం**



కర్ణాటకలోని ప్రపంచ ప్రఖ్యాత హంపిలో ఉన్న 15వ శతాబ్దానికి చెందిన విఠల ఆలయం అనేక అద్భుతాలకు నెలవు. అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సంగీత స్తంభాల గురించి. గట్టి గ్రానైట్ రాళ్లతో నిర్మించిన ఈ స్తంభాలను మెల్లగా తాకినప్పుడు, అవి స్పష్టమైన సంగీత స్వరాలను ఎలా పలికిస్తాయనేది శతాబ్దాలుగా అంతుచిక్కని రహస్యం. అయితే, ఆధునిక శాస్త్రీయ విశ్లేషణలు ఈ పురాతన ధ్వని ఇంజనీరింగ్ అద్భుతం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించాయి. విజయనగర సామ్రాజ్య కాలంలో నిర్మించిన ఈ ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఇక్కడి మహామండపంలో ఉన్న ఒక్కో ప్రధాన స్తంభం చుట్టూ, అదే రాతి నుంచి చెక్కిన అనేక చిన్న స్తంభాలు ఉంటాయి. వీటిని సమిష్టిగా "సరిగమ స్తంభాలు" అని పిలుస్తారు. ఒకప్పుడు ఈ ప్రాంగణంలో నృత్యకారులు నాట్యం చేస్తుండగా, ఈ స్తంభాలను తాకుతూ లయకు అనుగుణంగా శబ్దాలు సృష్టించేవారని చరిత్రకారులు చెబుతారు. ఈ స్తంభాలు ప్రాచీన భారతీయ గ్రంథమైన 'నాట్య శాస్త్రం'లో' పేర్కొన్న 'ఘన వాద్య' వర్గానికి చెందినవి. ఈ స్తంభాల నిర్మాణంపై ఎన్నో ఊహాగానాలు ఉండేవి. లోపల ఖాళీగా ఉంచడం వల్ల లేదా లోహపు కడ్డీలు అమర్చడం వల్ల శబ్దం వస్తుందని భావించేవారు. కానీ, కల్పక్కంలోని ఇందిరా గాంధీ అటామిక్ రీసెర్చ్ సెంటర్ మెటలర్జీ శాస్త్రవేత్తలు 2008లో చేసిన ఒక కీలక అధ్యయనం ఈ వాదనలను తోసిపుచ్చింది. వారు స్తంభాలకు ఎలాంటి హాని కలగకుండా అల్ట్రాసోనిక్ టెస్టింగ్, ఇంపాక్ట్-ఎకో వంటి నాన్-డిస్ట్రక్టివ్ పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలో స్తంభాలు పూర్తిగా గట్టి గ్రానైట్‌తోనే నిర్మించబడ్డాయని స్పష్టమైంది. అత్యంత సాంద్రత కలిగిన ఈ గ్రానైట్ రాతిలో శబ్దం సెకనుకు 4,800 నుంచి 5,500 మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. స్తంభం పొడవు, మందం, ఆకృతి ఆధారంగా అది వెలువరించే సంగీత స్వరం ఆధారపడి ఉంటుంది. పొట్టిగా, మందంగా ఉన్న స్తంభాలు హెచ్చు స్వరాలను, పొడవుగా, సన్నగా ఉన్నవి తక్కువ స్వరాలను ఉత్పత్తి చేస్తాయి.

# లోకేశ్, బ్రాహ్మణి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

- **రాష్ట్ర శ్రేయస్సు కోసం లోకేశ్, బ్రాహ్మణి దంపతుల రుద్రాభిషేకం**

**హైదరాబాద్,నగర నిజం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వారు మహాశివుడికి ఈ పూజలు చేశారు. పవిత్రమైన సోమవారం సందర్భంగా, వేద పండితుల మార్గదర్శకత్వంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి, శ్రేయస్సు, ప్రజా సంక్షేమం కోసం పరమశివుడి ఆశీస్సులు కోరుతూ ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. రుద్రాభిషేకం అనంతరం లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించారు. రాష్ట్ర ప్రజల మేలు కోరుతూ మంత్రి దంపతులు ఈ పూజలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రుద్రాభిషేకం ఫొటోలను పంచుకున్నారు.

## వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ఎఫ్.ఏ.క్యూ నిబంధనలకు ప్రకారంగా వేగంగా పూర్తి చేయాలి

- **అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు**





**వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 15** సోమవారం నాడు పానగల్ మండలంలోని జమ్మాపూర్, శాఖాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం సేకరణ, తూకాలు, లోడింగ్, తరలింపు ప్రక్రియలను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ఎఫ్.ఏ.క్యూ (ఫైర్ యావరేజ్ క్వాలిటీ ) నిబంధనలకు అనుగుణంగా జరగాలని, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాల మేరకు పరిశీలించి సకాలంలో కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రాల్లో హమాలీల సంఖ్యను పెంచాలని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు సంబంధించిన ట్రక్ షీట్ల అప్‌డేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, తద్వారా రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు, లోడింగ్ ప్రక్రియ ఎంత వేగంగా పూర్తవుతుందో దానికి అనుగుణంగా సరిపడా రవాణా వాహనాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పరస్పర సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

## యూపీలో 'ఇండియా' కూటమిలో ఎంఐఎం చిచ్చు..

### 2027 యూపీ ఎన్నికల్లో ఎంఐఎంతో పొత్తుపై ఇండియా కూటమిలో భిన్నాభిప్రాయాలు



**హైదరాబాద్,నగర నిజం:** ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా విపక్షాలు వ్యూహరచన చేస్తున్న తరుణంలో, 'ఇండియా' కూటమిలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీతో పొత్తు పెట్టుకునే అంశంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్‌ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. బీజేపీని ఎదుర్కొనేందుకు ఐక్యం గా సాగాలని భావిస్తున్న ఈ కూటమిలో తాజా పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. ఎంఐఎంతో పొత్తుపై ఎస్పీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు రామ్ గోపాల్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. బీజేపీని ఓడించేందుకు కృషి చేసే ఏ శక్తినైనా తాము స్వాగతిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం దీనికి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒకవైపు మతతత్వాన్ని వ్యతిరేకిస్తూనే, మరోవైపు అదే తరహా రాజకీయాలు చేసే వారితో చేతులు కలపడం సాధ్యంకాదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానమే తీసుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బీజేపీని అధికారం నుంచి దూరం చేసేందుకు తాము 'ఇండియా' కూటమిలో చేరడానికి సిద్ధంగా ఉన్నామని అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటికే ప్రకటించారు.

# ఫిర్యాదులపై తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు

- **పోలీస్ అంటే ప్రజలకు భరోసా కలిగించే విధంగా పనిచేయాలి**
- **ప్రజావాణిలో 25 ఫిర్యాదుల స్వీకరణ**
- **జిల్లా ఎస్పీ: సునీత రెడ్డి ఐపీఎస్**



**వనపర్తి జిల్లా నగర నిజం జూన్ 15 జూన్** సోమవారం నాడు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 25 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్.,కి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశాలు జారీ చేశారు. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 25 ఫిర్యాదుల్లో 17,భూతగాదాల ఫిర్యాదులు08, పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వున్నాయి.



# రాజేంద్రనగర్ లో పర్యటించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్





- **భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశం**

**రాజేంద్రనగర్, జూన్ 15 (నగరనిజం ప్రతినిధి):** భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా కమీషనర్ క్షేత్రస్థాయి పర్యటన మొదలుపెట్టారు. భారీ వర్షాలతో వరద ముంపుకు గురవుతున్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన కమీషనర్ రంగనాథ్.... అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు సోమవారం నాడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్ లో పర్యటించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్.... పలు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమీషనర్ జోయల్ డేవిస్, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ రామకృష్ణ, రాజేంద్రనగర్ జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికార యంత్రాంగంతో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించిన కమీషనర్ రంగనాథ్.... సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాజేంద్రనగర్ పరిధిలోని రామ్ దేవ్ బాబా నగర్,పీవీ ఎక్స్ప్రెస్ పిల్లర్ నెంబర్ 265 తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన రంగనాథ్.... వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వరద నీరు నిలవడానికి ప్రధాన కారణాలు ఏమిటో అన్వేషించాలని, మ్యాన్ హోల్స్ వద్ద చెత్త చెదారం, వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్ గ్రేటర్ అధికారులతో పాటు హైడ్రా సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

